

భూసేకరణతో అన్యాయం

జగిత్యాల, న్యూస్‌టుడే: జాతీయ రహదారి భూసేకరణతో అన్యాయం జరుగుతుందని జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామరైతులు శనివారం జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌కు వినతిపత్రం సమర్పించారు. వారసత్వంగా వచ్చిన తమ భూములు రహదారి విస్తరణలో పోతే జీవనాధారం కోల్పోతామని రైతుల అభిప్రాయం తెలుసుకోకుండా భూసేకరణ చేస్తున్నారన్నారు. కొత్తగా సర్వే చేసి మార్కెట్ విలువ ప్రకారం 4 రెట్లు అధికంగా పరిహారం చెల్లించాలని కోరారు.

ఈనాడు జగిత్యాల

ఆదివారం సెప్టెంబరు 29, 2024 5

ప్రణాళికతో చదివితే.. పదిలో విజయం

విద్యార్థులకు విషయ నిపుణుల సలహాలు

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యావిభాగం

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ జీపీఏను సాధించాలనే లక్ష్యంతో ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ప్రత్యేక తరగతులు, ట్యూషన్లు, హోంవర్క్‌లు వంటి వాటితో పుస్తకాల పురుగుల్లా మారుతున్నారు. అయితే కొందరికి పాఠ్యాంశాలపై సరైన ప్రణాళిక, పరీక్షలపై అవగాహన కొరవడటం వంటి వాటితో ఆందోళన చెందుతున్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో శ్రమిస్తూ కొంత ఒత్తిడికి గురవుతున్నారు. ఈ పరీక్షలకు దాదాపు 6 నెలల సమయం ఉంది. ఈ క్రమంలో గణితం, సైన్స్ పరీక్షలకు సంబంధించి దృష్టి సారించాల్సిన అంశాలపై విషయ నిపుణులు 'న్యూస్‌టుడే'కు వివరించారు.



కరీంనగర్ సప్తగిరికాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

సంసిద్ధతతో గణితంలో మంచి మార్కులు

- గణితంలో ఉత్తమ జీపీఏ కోసం విద్యార్థులు ఇప్పటి నుంచే నిత్యం గంటకుపైగా సమయాన్ని వెచ్చించాలి.
- ప్రతి అధ్యాయంలోని కీలక భావనలు, సూత్రాలను రోజూ పునశ్చరణ చేయాలి. ముఖ్య సూత్రాలను చార్ట్ రూపంలో తయారుచేసి ఇంట్లో అంటించుకోవాలి.
- గత ప్రశ్నపత్రాల్లోని ప్రశ్నలు తిరిగి పునరావృతం కానప్పటికీ.. వాటి మాదిరిగా ఉన్న ప్రశ్నలను ఎక్కువగా సాధన చేయాలి. ఎస్‌ఈఆర్టీ వారి గణిత అభ్యాస దీపికల నుంచి ఎక్కువ ప్రశ్నలు వచ్చే అవకాశమున్నందున వాటిపై దృష్టి పెట్టాలి. 10జీపీఏ సాధన కోసం అన్ని అధ్యాయాలపై పట్టు సాధించాలి.
- వ్యాసరూప ప్రశ్నలకు ఎక్కువ మార్కులు ఉన్నందున వాస్తవ సంఖ్యలు, బహుపదులు, నిరూపక రేఖాగణితం, సరూప త్రిభుజాలు, త్రికోణమితి, సాంఖ్యాక శాస్త్రం, సంభావ్యత అధ్యాయాలపై పట్టు సాధించాలి.
- సమితులు, సాంఖ్యాక శాస్త్రం, సంభావ్యత అధ్యాయాల అంశాలను అభ్యాసం చేయడం ద్వారా సులభంగా ఉత్తీర్ణులు కావచ్చు.
- వెన్ చిత్రాలు, వర్గ బహుపది, వృత్తమునకు స్పర్శ రేఖలను గీయడం, సరూప త్రిభుజాల నిర్మాణాలు, ఓజీవ్ వక్రములను నిర్మించడాన్ని పలుమార్లు సాధన చేస్తే మంచి మార్కులు సాధ్యం.
- సమితులలో సమ్మేళనం, ఛేదనం, పూరకము, భేదం లాంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. పరీక్షల సన్నద్ధత కోసం వీలైనన్ని నమూనా ప్రశ్నపత్రాలను ప్రాక్టీసు చేయడం అలవాటు చేసుకోవాలి.
- పార్ట్-బి(ఆబ్జెక్టివ్) పేపర్‌లోని సమస్యలకు ప్రతి అధ్యాయం నుంచి కీలక అంశాలు, సూత్రాలు ప్రాక్టీసు చేయాలి. పాఠ్యపుస్తకంలోని అన్ని బిట్లు ప్రాక్టీసు చేయడం మరొవద్దు.



- మనోహర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, రిసోర్స్ పర్సన్, జడ్పీ ఉన్నత పాఠశాల, గోరింటాల

విభజించి చదివితే భౌతికశాస్త్రం సులభం..

- పరీక్షలకు దాదాపు 6 నెలల సమయం ఉండటంతో.. భౌతిక శాస్త్రంలోని 12 అధ్యాయాలను విభజించుకుని చదివితే ఉత్తమ గ్రేడ్ సాధ్యం. విభజించుకునేటప్పుడు దగ్గరి సంబంధం గల పాఠాలను ఎంచుకోవాలి. ఉదాహరణకు మొదటి, 3వ పాఠంలోని భావనలు ఒకే విధంగా ఉంటాయి.
- ప్రతి పాఠంలోని ముఖ్యమైన సూత్రాలను నిత్యం సాధన చేయాలి. వాటిని ఒకే దగ్గర రాసి పెట్టుకుని.. సమస్యలను సాధన చేస్తూ ఉండాలి.
- కీలకమైన పటాలను తరచూ ప్రాక్టీసు చేస్తూ.. వాటి భావనలను నిజ జీవితంలో అన్వయించుకుంటూ చేయాలి. దీనివల్ల వాటిని విద్యార్థులు మరిచిపోరు.
- పుస్తకంలోని టేబుల్స్‌ను శ్రద్ధగా పరిశీలించి వాటిపై ఇప్పటినుంచే పట్టు సాధించాలి. వీటి నుంచే సమాచార నైపుణ్యానికి సంబంధించిన ప్రశ్నలు రానున్నాయి.
- కాంతికి సంబంధించిన కిరణచిత్రాలు, ఆవర్తనం, నాభ్యాంతరం కనుగొనే ప్రయోగం, దృష్టి లోపాలకు సంబంధించిన వాటిపై ఎక్కువ దృష్టి పెట్టాలి.
- రసాయన శాస్త్రానికి సంబంధించి రోజువారీ జీవితంలో ఆమ్లాలు, లవణాలు, అనువర్తనాలను తెలుసుకునేలా సాధన చేయాలి. ఆధునిక ఆవర్తన పట్టికను పూర్తిగా అర్థం చేసుకోవాలి.



-జయపాల్‌రెడ్డి, స్కూల్ అసిస్టెంట్(ఫిజిక్స్), ప్రభుత్వ ధన్గర్‌వాడి ఉన్నత పాఠశాల, కరీంనగర్



జీవశాస్త్రాన్ని పూర్తిగా అర్థం చేసుకుంటేనే..

- జీవశాస్త్రంలోని పాఠ్యాంశాలను పూర్తిగా అర్థం చేసుకుంటే ప్రశ్నలకు సమాధానాలు సులభం. కీలక భావనలు, శాస్త్రీయ నామాలు, పటాల ప్రయోగాలను తరచూ సాధన చేస్తూ సొంత మాటల్లో రాసేలా సన్నద్ధం కావాలి.
- జీవశాస్త్రంలోని పోషణ, శ్వాసక్రియ, విసర్జక, నియంత్రణ వ్యవస్థ, ప్రత్యుత్పత్తి లాంటి పాఠ్యాంశాలు చదివేటప్పుడు.. ఆ ప్రక్రియ జీవులలో, మొక్కల్లో, మానవునిలో ఎలా ఉంటుందనే దానిపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి. వాటిని సొంత మాటల్లో వివరించేలా సాధన చేయాలి.
- పర్యావరణం, సహజ వనరులు పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగే అవకాశముంది. పర్యావరణ సమస్యలపై, సహజ వనరుల పొదుపుపై స్వతహాగా అవగాహన ఏర్పరచుకోవాలి.



-ఆంజనేయులు, స్కూల్ అసిస్టెంట్(జీవ శాస్త్రం), జడ్పీ ఉన్నత పాఠశాల, జూబ్లీనగర్



బతుకమ్మ వేడుకల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ తదితరులు

బతుకమ్మ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

జగిత్యాల, న్యూస్‌టుడే: బతుకమ్మ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ అన్నారు. శనివారం ఎస్‌కెఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు జరగగా న్యాయమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సామాజిక మాధ్యమాలతో సమయం వృథా చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి మంచి పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఆడిపాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరిగెల అశోక్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.శ్రీనివాస్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ పి.రాజు, అధ్యాపకులు సురేందర్, సాయిమధుకర్, గోవర్ధన్, రాంచంద్రం, రజిత, సుప్రియ, ప్రతిభ, కవిత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జైలులో న్యాయవిజ్ఞాన సదస్సు


జగిత్యాల, న్యూస్‌టుడే: జగిత్యాల ప్రత్యేక సబ్‌జైలులో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైలులో అందుతున్న సేవలపై ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. పండ్లు పంపిణీ చేశారు. జైలు అధికారి మొగిలేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కె.చంద్రమోహన్, పి.సతీష్, ఆర్.విజయ్‌క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్ తదితరులు

రోళ్లవాగు పనుల పూర్తికి చర్యలు

'న్యూస్‌టుడే'తో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



న్యూస్‌టుడే, జగిత్యాల గ్రామీణం

జగిత్యాల నియోజకవర్గంలో సమస్యలను గుర్తించామని.. రోళ్లవాగు ప్రాజెక్టులో మిగిలిన పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు.. రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో పనులు పూర్తి చేసి లబ్ధిదారులు నివాసం ఉండేలా.. అనంతారం వద్ద వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వివరాలు వెల్లడించారు. ఈ వివరాలు..

ముఖాముఖి

? బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు పనుల్లో జాప్యంతో రైతులకు ఇబ్బందిగా మారింది.

సమాధానం: బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు భూసేకరణతో ఆలస్యమైంది. మరో నెల రోజుల్లో అటవీశాఖకు భూమి అప్పగిస్తాం. దాదాపు పనులు పూర్తయ్యాయి. తూములకు షట్టర్లు బిగించాల్సి ఉంది. త్వరలోనే ప్రాజెక్టును అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.

? అనంతారం వద్ద జాతీయ రహదారిపై లోలెవల్ వంతెనతో ఏటా రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

స: అనంతారం లోలెవల్ వంతెన జాతీయ రహదారి పరిధిలో ఉండటంతో సమస్యపై ఎంపీ అర్వింద్‌కు వినతి పత్రం అందజేశాం. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. నిధులు మంజూరు కాగానే వంతెన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. వంతెన పూర్తి చేయించే బాధ్యత నేను తీసుకుంటా.

? యావర్ రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు.

స: జగిత్యాల పట్టణంలో రహదారుల విస్తరణపై దృష్టి సారించాం. జగిత్యాల పట్టణంలో రద్దీ పెరుగుతున్నందున ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటాం. నిజామాబాద్ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే పనులు పూర్తవుతాయి.

? పట్టణంలో పారిశుద్ధ్యం లోపించటం, పురపాలికలో తరచూ అక్రమాలు వెలుగుచూస్తున్నాయి.

స: పట్టణంలో పారిశుద్ధ్య పనుల కోసం 4 ట్రాక్టర్లు కొనుగోలు చేశాం. పురపాలికపై నిత్యం సమీక్షిస్తూనే ఉన్నాను. పారిశుద్ధ్యం లోపించకుండా అధికారులు, ఛైర్‌పర్సన్‌తో మాట్లాడుతున్నాను. సమస్య రాకుండా చూడాలని ఆదేశించాను. ఏదైనా సమస్యలు ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాను.

? నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఎలా సాగుతున్నాయి.

స: నూకపల్లి అర్బన్ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.35 కోట్లు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే పనులు పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటాను. అంతర్గాంలో చేపట్టిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం కోసం రూ.85 లక్షలు మంజూరయ్యాయి. మహిళా డిగ్రీ కళాశాలకు అటానమస్ రావటం, రూ.4 కోట్లతో కళాశాలలో భవన నిర్మాణ పనులు చేపడుతున్నాం. పురాతన పాఠశాలలో తరగతి గదులు నిర్మించి ప్రారంభించాం.

నాటకోత్సవాలకు ఎంపిక

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి నాటకోత్సవ పోటీలను స్థానిక టీచర్స్ భవన్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో పెగడపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు నీటి సంక్షోభం ఉప అంశం ఆధారంగా ప్రదర్శించిన నాటిక మొదటి స్థానంలో నిలిచింది. స్థానిక జ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటిక రెండో స్థానంలో నిలిచింది. జిల్లాలోని 17 పాఠశాలల విద్యార్థులు తమ ప్రదర్శనలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో తొలి, రెండు స్థానాలు సాధించిన విద్యార్థులు అక్టోబరు 17, 18 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ నాటకోత్సవాలకు ఎంపికయ్యాయి. జిల్లా విద్యాశాఖాధికారి జగన్మోహన్‌రెడ్డి విద్యార్థులను అభినందించి రాణించాలని సూచించారు. రాజేంద్రప్రసాద్, అక్కెనపల్లి సతీష్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో జగన్మోహన్‌రెడ్డి

ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు

జగిత్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే: జగిత్యాల పట్టణంలోని శ్రీవివేకానంద మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోటీలు శనివారం ముగిసాయి. వాలీబాల్ పోటీలో వెల్గటూర్ జట్టు, ఖోఖోలో కోరుట్ల, కబడ్డీలో కొడిమ్యాల విజేతలుగా నిలవగా, ధర్మపురి, మెట్‌పల్లి, రాయికల్ జట్లు రెండో స్థానం సాధించాయి. నవీన్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.లక్ష్మీరామ్‌నాయక్, పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీడీలు క్రిష్ణప్రసాద్, అజయ్, సాగర్, కోటేశ్వర్, వేణు, భాస్కర్, జమున, వెంకట్, లక్ష్మి, మల్లీశ్వరి పాల్గొన్నారు.



వాలీబాల్ విజేత వెల్గటూరు జట్టు

అన్నప్రసాదం కొందరికే!

కొండగట్టులో భక్తులకు తప్పని నిరాశ

న్యూస్‌టుడే, మల్యాల

కొండగట్టు అంజన్న ఆలయంలో అన్నదానం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంలేదు. ఏటా దాదాపు రూ.20 కోట్ల ఆదాయం కలిగిన కొండగట్టు అంజన్న దర్శనానికి శని, మంగళవారాల్లో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20 వేలకుపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం స్వామివారి ప్రసాదంగా అన్నదాన సత్రంలో భోజనం చేయాలని భావించినా అవకాశం లభించక తీవ్ర నిరాశతో వెనుతిరుగుతుంటారు.

200 మందికి మాత్రమే

స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఉదయం 11 లోపు ఆలయంలో అందజేసే ఉచిత అన్నదానం టిక్కెట్టు తీసుకుని మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత పాత కోనేరు పైభాగంలోని అన్నదాన సత్రంలో భోజనం చేయాల్సి ఉంటుంది. పావు గంటలోపే అన్నదానం టిక్కెట్లన్నీ పంపిణీ జరుగుతుండటంతో తర్వాత వచ్చే భక్తులు నిరాశతో వెళ్తుంటారు. ప్రతి శని, మంగళవారాల్లో 200 చొప్పున, మిగిలిన రోజుల్లో 100 మంది చొప్పున భక్తులకు అన్నదానం చేస్తుంటారు. కొండపైన పనిచేసే ఆలయ సిబ్బంది, పోలీసులు, రక్షణ సిబ్బంది 50 మంది వరకు అన్నదాన సత్రంలోనే భోజనం చేస్తుంటారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రతి సోమవారం వెయ్యి మంది భక్తులకు, ఇతర వారాల్లో 500 మందికి ఉచితాన్నదానం చేస్తుంటారు.



అన్నదాన సత్రంలో భోజనం చేస్తున్న భక్తులు

ప్రతిపాదనలు పంపిస్తాం

అన్నదాన సత్రంలో నిత్యం 150 మందికి, శని, మంగళవారాల్లో 250 మందికి భోజన వసతి కల్పించాలని కోరుతూ దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు అందజేస్తాం. అన్నదాన సత్రంలో భక్తులకు నాణ్యమైన భోజనం అందించేలా పర్యవేక్షిస్తున్నాం. బృహత్ ప్రణాళిక అమలుతో భక్తులకు వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

- రామకృష్ణారావు, ఈవో

విరాళాలు వస్తున్నా..

అన్నదానం కోసం భక్తులు తమకు తోచినంత విరాళాలు అందజేస్తుంటారు. అన్నదానం పేరుతో భక్తులు అందజేసిన విరాళాలు రూ.2,45,67,719 ఎఫ్‌డీల రూపంలో ఉన్నాయి. అన్నదానం నిర్వహణ కోసం భక్తులు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు విరాళాలు అందజేస్తుంటారు. అప్పుడప్పుడు కొందరు వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు రూ.లక్షల్లో ఇస్తుంటారు. కొందరు వ్యవసాయదారులు తాము పండించిన బియ్యాన్ని స్వామివారికి అప్పగిస్తుంటారు. ఈ విధంగా అప్పగించిన సన్న బియ్యాన్ని అన్నదానానికి వినియోగిస్తుంటారు. అంజన్న పేర అందజేసే విరాళాలకు ఐటీ మినహాయింపు ఉన్నప్పటికీ ఈ సదుపాయం చాలా మంది భక్తులకు తెలియదు. డిజిటల్ రూపంలో విరాళాలు చెల్లించే సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

సంఖ్య పెంచాలని డిమాండు

నిత్యం అన్నదాన సత్రంలో 200 మందికి, శని, మంగళవారాల్లో 300 మంది చొప్పున భోజన వసతి కల్పిస్తే బాగుంటుందని భక్తులు కోరుతున్నారు. గతంలో పలువురు నాయకులు కూడా సంఖ్యను పెంచాలని అధికారులకు సూచించినా అమలుకు నోచుకోవడం లేదు. దాదాపు 25 ఏళ్ల కిందట భక్తులు బస చేయడానికి నిర్మించిన డార్మిటరీ భవనాన్నే అన్నదాన సత్రం, లడ్డూ పులిహోర తయారీ కేంద్రంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుత అవసరాలనుబట్టి అన్నదాన సత్రం, ప్రసాదం తయారీ కేంద్రాలకు ప్రత్యేక భవనాలు, షెడ్లు నిర్మించాల్సి ఉంది.

106 కిలోల గంజాయి దహనం

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసుస్టేషన్లలో నమోదైన 43 కేసుల్లో స్వాధీన పర్చుకున్న 106.6 కిలోల గంజాయిని శనివారం దహనం చేశారు. ఎస్పీ అశోక్‌కుమార్, డ్రగ్ డిస్పోజల్ కమిటీ సభ్యులు అదనపు ఎస్పీ భీంరావు, ఎస్బీ డీఎస్పీ రవీంద్రకుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ కేసుల వారీగా పట్టుకున్న గంజాయిని పరిశీలించి పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటిస్తూ దహనం చేశారు. సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, సీఐలు రాంనర్సింహారెడ్డి, నీలం రవి, క్రిష్ణారెడ్డి, సురేష్‌బాబు, ఆర్.ఐ. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ

ఇసుక వాహనాలు సీజ్

కోరుట్ల, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని సంగెం రోడ్‌లో ఫుల్‌వాగులో శనివారం ఉదయం అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. విషయం తెలిసిన వెంటనే రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. వాగులో ఇసుకను తవ్వుతున్న ఒక జేసీబీ, ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. పట్టుకున్న వాహనాలను ఆర్టీసీ డిపోనకు తరలించినట్లు చెప్పారు. ఇటీవల ఫుల్‌వాగులో అక్రమంగా ఇసుకను కుప్ప చేస్తున్న బ్లేడ్ ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించగా రాత్రిపూట మాయం చేశారు. విషయం తెలిసిన అనంతరం తహసీల్దార్ సదరు ట్రాక్టర్ యజమానిపై కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదుకు సిద్ధం కాగా వెంటనే వచ్చి లొంగిపోయి రూ.25 వేల జరిమానా కట్టినట్లు పేర్కొన్నారు.



కోరుట్ల ఫుల్‌వాగులో ఇసుకను తవ్వుతున్న జేసీబీ, తరలిస్తున్న ట్రాక్టర్



వెల్లుల్లలో వివరాలు తెలుసుకుంటున్న జాయింట్ కమిషనర్ శ్రీనివాస్

స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దాలి

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛ పల్లెలుగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు కలిసికట్టుగా ముందుకు సాగాలని పంచాయతీరాజ్ శాఖ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. వెల్లుల్ల, చౌలమద్ది గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. జాతీయ పంచాయతీరాజ్ అవార్డుల్లో భాగంగా వెల్లుల్లను స్వయం సమృద్ధితో కూడిన మౌలిక సదుపాయాల విభాగంలో చూపుతున్న ప్రగతిని పరిశీలించారు. చౌలమద్దిలో పౌర సేవల విభాగంలో అమలు చేస్తున్న సేవలు, రికార్డులను పరిశీలించారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

జగిత్యాల: జిల్లాలో ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ అశోక్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల పట్టణ పోలీసుస్టేషన్‌లో అటాచ్డ్‌గా ఉన్న ఎస్సై సీహెచ్ సుధీర్‌రావును రాయికల్‌లో నియమించారు. వెకెన్సీ రిజర్వ్‌లో ఉండి సీసీఎస్‌కు అటాచ్డ్‌గా ఉన్న ఎస్సై ఇ.కిరణ్‌ను జగిత్యాల పట్టణ పోలీసుస్టేషన్‌కు అటాచ్ చేశారు.


అప్రమత్తతతో గుండె పదిలం

- ఉమ్మడి జిల్లాలో రోజుకు 200 శస్త్రచికిత్సలు
- నేడు ప్రపంచ హృదయ దినోత్సవం

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

● పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్న 36 ఏళ్ల యువకుడు అలసట, చెమటలు పట్టడం వల్ల నీరసంగా ఉండడంతో కరీంనగర్‌లోని వైద్య నిపుణులను సంప్రదించగా పరీక్షలు నిర్వహించి గుండె పోటుగా నిర్ధారించారు. అవసరమైన స్టంట్ వేయడంతో కోలుకున్నారు. ఆ యువకుడికి రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు లేకపోయినా గుండెపోటు రావడం ఆ కుటుంబాన్ని ఆందోళనకు గురి చేసింది.

● జగిత్యాలకు చెందిన 50 ఏళ్ల రైతు రోజూ వ్యవసాయ పనులు చేసుకుంటారు. ఆరోగ్యమైన జీవనం గడుపుతున్నారు. కరీంనగర్‌లోని తన కుమారుడి వద్దకు వచ్చినప్పుడు సాధారణ వైద్య పరీక్షలు చేయించగా గుండె సమస్య ఉన్నట్లు నిర్ధారణ కావడంతో ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించారు.



పై రెండు ఉదాహరణలు చూస్తే ఒకరేమో యువకుడు నిత్యం శ్రమ చేస్తున్నవారు.. మరొకరు రోజూ పొలంలో చెమటోడ్చే రైతన్న.. ఇద్దరికీ దురలవాట్లు ఏమీ లేవు.. అయినా గుండె సంబంధిత సమస్యలు రావడం అందరూ ఎంత అప్రమత్తంగా ఉండాలో తెలియజేస్తోంది.. మారుతున్న జీవనశైలి ప్రభావమో.. ఇతర కారణాలో గాని గుండె సంబంధిత బాధితులు ఉమ్మడి జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్నారు.. సకాలంలో స్పందించి వైద్యం చేయించుకున్నవారు ప్రాణాపాయం నుంచి తప్పించుకుంటుండగా.. లక్షణాలు గుర్తించలేని వారు ప్రాణాలు కోల్పోతున్నారు..



మీకు తెలుసా?

- మధుమేహం, రక్తపోటు బాధితుల్లో 15 శాతం మందికి గుండె జబ్బులు వచ్చే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. రెండూ ఉంటే మరింత ఎక్కువ ప్రమాదం.
- అధిక బరువు ఉండటం.. శారీరక శ్రమ లేకపోవడం, ధూమపానం, మద్యం తాగడం, అధిక కొవ్వు పదార్థాలు, మసాలా వంటకాలు తినడం సమస్య తీవ్రతను పెంచుతాయి.
- ఒత్తిడికి ఎంత దూరంగా ఉంటే అంతమంచిది. సమతుల ఆహారం తీసుకోవడం, నిత్య వ్యాయామం చేసేవారు కూడా ఒత్తిడికి గురైతే గుండె సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు.

అసాంక్రమిక వ్యాధుల సర్వే (ఉమ్మడి జిల్లా) ప్రకారం..



- రక్తపోటు బాధితులు : **2,14,538** మంది
- మధుమేహం ఉన్నవారు : **1,13,218** మంది

లక్షణాలు



- తీవ్రమైన ఛాతి నొప్పి, వికారం, శరీరం అంతా చెమటలు పట్టడం ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడటం
- ఛాతిలో నొప్పి ప్రారంభమై ఎడమ చేతి, ఎడమ దవడ, కుడి చేతి వరకు లాగుతూ ఉంటాయి.
- నడిచేటప్పుడు ఛాతిలో నొప్పి వస్తూ అసౌకర్యంగా ఉంటే దానిని గుండెపోటుగా భావించాలి.
- గుండెలో సమస్య ఉంటే సాధారణం కంటే ఎక్కువగా కొట్టుకుంటుంది.

జాగ్రత్తలివి..



- ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలి.
- సమతుల ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, మొలకలు రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి.
- వేపుళ్లు, జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్, శీతల పానీయాలు తీసుకోవద్దు.
- ప్రతి రోజూ మీ శారీరక సామర్థ్యం మేరకు వ్యాయామం తప్పనిసరి. కనీసం 45 నిమిషాలపాటు నడక అయినా జీవనంలో భాగం చేసుకోవాలి.
- ఒత్తిడికి గురికావొద్దు. పనిని ప్రణాళికతో చేయడం ద్వారా చాలా ఒత్తిడి తగ్గించుకోవచ్చు. ధ్యానం, యోగా ద్వారా ఒత్తిడి దూరమవుతుంది.
- గుండెపోటు వచ్చినట్లు అనిపిస్తే ఆందోళన చెందొద్దు. బరువులు ఎత్తవద్దు. మానసికంగా ప్రశాంతంగా ఉంటూ వెంటనే సమీప ఆస్పత్రికి వెళ్లాలి.
- ఎవరైనా గుండెపోటుతో అకస్మాత్తుగా పడిపోయి స్పృహ కోల్పోతే వెంటనే ఛాతిపై రెండు చేతులు పెట్టి గట్టిగా నొక్కుతూ (సీపీఆర్) చేయాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి.
- 30 ఏళ్లు దాటిన వారు ఏటా సాధారణ వైద్య పరీక్షలు చేయించుకుంటే ఆరోగ్య సమస్యలు గుర్తించొచ్చు. **- డా.దినకర్, గుండె వైద్య నిపుణులు, కరీంనగర్**



ఉమ్మడి జిల్లాలో (గుండె వైద్య నిపుణులు ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల వివరాల ప్రకారం) ఇలా..

- నెలకు వివిధ ఆస్పత్రుల్లో చేరుతున్న గుండె సంబంధిత సమస్య బాధితులు : **1500**
- శస్త్రచికిత్సలు చేసుకుంటున్నవారు : **200**
- గతేడాదితో పోలిస్తే పెరిగిన కేసులు : **10** నుంచి **15** శాతం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక విభాగం కరవు

ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రభుత్వ వైద్య కళాశాలలు ఉన్నా గుండె సంబంధిత వైద్య నిపుణులు, ఈ విభాగానికి సంబంధించి ప్రత్యేక సౌకర్యాలు లేకపోవడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులను, లేదంటే హైదరాబాద్ వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో గుండె సంబంధిత సమస్యల బాధితులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం బోధనాసుపత్రుల్లో గుండె వైద్య నిపుణులను నియమించాలని, ఆ విభాగాన్ని ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలని జనం కోరుకుంటున్నారు.

తప్పుల తడకగా రెండో జాబితా

డీఎస్సీ-2008 బాధిత అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

కరీంనగర్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి కరీంనగర్ జిల్లా 2008 డీఎస్సీ బాధిత అభ్యర్థులకు ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీ ఉద్యోగాల కల్పనకు జిల్లా విద్యాశాఖ చేపట్టిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం కొనసాగుతోంది. కరీంనగర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం పరిశీలన బృందం 67 మంది ధ్రువపత్రాలను పరిశీలించారు. వచ్చే నెల 4వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. విద్యాశాఖ ప్రకటించిన జాబితాపై అయోమయం కొనసాగుతూనే ఉంది. మొదట 61 మందితో ప్రకటించిన జాబితాలో ఉద్యోగాలు చేస్తున్న వారి పేర్లు ప్రకటించారు. ఈ తప్పు తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ శుక్రవారం 186 మంది బాధిత అభ్యర్థులతో రెండో జాబితాను ప్రకటించి వారి ధ్రువపత్రాల పరిశీలనను ప్రారంభించింది.



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న విద్యాశాఖ బృందం

తొలగని అయోమయం...

రెండో జాబితా కూడా తప్పుల తడకగా ఉందని, ఉద్యోగాలు సాధించిన వారి పేర్లతో పాటు మెరిట్ జాబితాలో లేని వారి పేర్లు కొన్ని వచ్చాయని అభ్యర్థులు పేర్కొంటున్నారు. 2010లో జిల్లా విద్యాశాఖ ప్రకటించిన మెరిట్ జాబితాలో ఉద్యోగాలకు అర్హత సాధించిన 15 మంది పేర్లు కూడా రెండో జాబితాలో లేవని సంబంధిత అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. 2008 డీఎస్సీలో ఎస్జీటీ ఉద్యోగాన్ని సాధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడి పేరు కూడా జాబితాలో ఉండటం గమనార్హం. బీసీ-ఈ కేటగిరీలో కూడా ఇతర విభాగం అభ్యర్థి పేరు ప్రకటించారని బాధితులు తెలిపారు. తమ గోడును వెళ్లబోసుకునేందుకు జిల్లా విద్యా శాఖ, కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆ 15 మంది బాధితులు వాపోయారు. రెండో జాబితాలో తన పేరు లేదని బిల్డింగ్ సూపర్‌వైజర్‌గా దశాబ్దకాలానికి పైగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న హుస్నాబాద్ మండలం గండిపెల్లికి చెందిన భుక్యా జెమ్లు పేర్కొన్నారు. డీఎస్సీ నిర్వహించి 16 ఏళ్లకు పైగా కావడంతో చాలామంది అప్పటి హాల్‌టికెట్లు, ర్యాంకు కార్డులు పోగొట్టుకున్నారు. వాటి కోసం ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. వాటి వివరాలు జిల్లా విద్యాశాఖ వద్ద ఉండటంతో పరిశీలనకు అనుమతించాలని సదరు అభ్యర్థులు కోరుతున్నారు. డీఎస్సీ అనంతరం అధికారులు ప్రకటించిన మెరిట్ జాబితాలో ఉన్న వారందరిని బాధిత అభ్యర్థుల జాబితాలో ప్రకటించి.. ధ్రువపత్రాల పరిశీలనను అధికారులు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మీసాల మల్లిక్ అధికారులను కోరారు.

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యూజికల్ గ్లో గార్డెన్ అందాలను వీక్షిస్తూ ముగ్ధులవుతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆబాలగోపాలాన్ని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు. సరదాసరదా కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేర్చుతున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలు పంచుకోవచ్చు పదండి.







రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

RAMOJI FILM CITY

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

మేమున్నాం.. మీకు తోడుగా... (10 AM TO 1 PM)

జగిత్యాల 94400 23123 | కోరుట్ల 9491324656 | ధర్మపురి 94403 88638

న్యూస్‌టుడే, ధర్మపురి

? లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం గోపురాల ముందు రహదారి పక్కనే దుకాణాలు నిర్వహిస్తున్నారు. దీంతో భక్తులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. - భక్తులు, ధర్మపురి

✓ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - గంగాధర్, పుర కమిషనర్, ధర్మపురి

రహదారిపై మొక్కజొన్న కంకుల తొలగింపు

మల్లాపూర్: కుస్తాపూర్ బైపాస్ రహదారిలో తరచూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న మొక్కజొన్న కంకులను రైతులు తొలగించారు. 'ఈనాడు'లో శనివారం 'మేమున్నాం మీకు తోడుగా'లో ప్రచురితమైనకు సమస్యకు పోలీసులు స్పందించి రైతులతో కంకులను తొలగించారు.

వందనం

కమిషనర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ ప్రజలకు మెరుగైన సేవలందించాలని, అధికారులు రాజకీయాలు చేయవద్దని బల్దియా కమిషనర్ మోహన్‌పై ఎమ్మెల్యే డా. సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఛైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన పుర సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పుర కమిషనర్‌గా ఉండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. ప్రొటోకాల్ ప్రకారం నిజామాబాద్ ఎంపీకి సమాచారం ఇవ్వడం లేదని భాజపా కౌన్సిలర్ చెట్లపల్లి మీనా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అజెండాలోని 22 అంశాలను కార్యాలయ ఉద్యోగి చదివి వినిపించగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పలువురు కౌన్సిలర్లు వార్డు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వైస్‌ఛైర్మన్ చంద్రశేఖర్‌రావు, డీఈ నాగేశ్వర్‌రావు, పలుశాఖ అధికారులు, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

అభివృద్ధి పనులకు భూమిపూజ

కోరుట్ల: కోరుట్ల మండలం పైడిమడుగు గ్రామంలో రూ.15 లక్షలతో నూతనంగా చేపడుతున్న రెండు సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు శనివారం ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ భూమిపూజ చేశారు. భారాస రాజ్యసభ ఎంపీ దామోదర్‌రావు తన ఎంపీ నిధులను కేటాయించినట్లు తెలిపారు. దారిశెట్టి రాజేశ్, చీటి వెంకట్రావ్, పీఏసీఎస్ ఛైర్మన్ జగన్‌మోహన్‌రావు, గోపాల్, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు ముత్యంపేట, చిట్టాపూర్, సాతారం గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన, ప్రమాదాలకు గురైన బాధిత కుటుంబాలను శనివారం కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఆదిరెడ్డి, ముద్దం శరత్ గౌడ్, కొమ్ముల జీవన్‌రెడ్డి, లింగస్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులతో కుటుంబాలకు అండ

సారంగాపూర్, న్యూస్‌టుడే: వృద్ధులు ఇళ్లలో ఉంటే కుటుంబాలకు అండగా ఉంటుందని సీడీపీవో వాణిశ్రీ పేర్కొన్నారు. శనివారం మండలంలోని అర్పపల్లి పోషణ మాసోత్సవాలలో భాగంగా వయో వృద్ధులను సన్మానించారు. అనంతరం వృద్ధులకు క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. పర్యవేక్షకులు లత, శైలజ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల్లో వృద్ధులు

విద్యార్థినులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి

జగిత్యాల పట్టణం: విద్యార్థినులు పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్ పేర్కొన్నారు. ఇటీవల స్వయంప్రతిపత్తి హోదా సాధించిన స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను శనివారం సందర్శించారు. కళాశాల తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థినుల సమస్యలపై వారితో మాట్లాడారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చంద్రయ్య, డాక్టర్ వై.సత్యనారాయణ, ప్రమోద్‌కుమార్, వాసవి, రహీం, జమున, సునిత, జ్యోత్స్న పాల్గొన్నారు.

సాగునీటిపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం

సారంగాపూర్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీటి రంగం పూర్తిగా నిర్వీర్యమైందని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. శనివారం బీర్‌పూర్ ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న వంతెనను పరిశీలించారు. బీర్‌పూర్ ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న వంతెన తక్షణ మరమ్మతు చేపట్టేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడామని, సోమవారం పనులు ప్రారంభిస్తారని తెలిపారు. మాజీ ఎంపీపీ మాసర్థి రమేష్, మహంకాళి రాజన్న, బల్మూరి లక్ష్మన్‌రావు, పొల్సాని నవీన్‌రావు, గుడిసె జితేందర్, చెర్పూరి సుభాష్, కోండ్ర రాంచందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వంతెనను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జిల్లాలో ఆక్రమణలు తొలగించాలి

జగిత్యాల, న్యూస్‌టుడే: జిల్లాలో హైడ్రా తరహా చట్టం తెచ్చి చెరువుల ఆక్రమణలు తొలగించాలని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అన్నారు. శనివారం జేఏసీ కోరుట్ల అభివృద్ధి ఫోరం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డిని కలిశారు. కోరుట్ల మద్దెల చెరువు, తాళ్ల చెరువు, కంచెర కుంట, గొలుసుకట్టు కాల్వలు, శిఖం భూములు, బఫర్‌జోన్లు వాగు పరివాహక ప్రాంతాలు అన్యాక్రాంతమవుతున్నాయని హద్దులు నిర్ణయించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. చెన్న విశ్వనాథం, బట్టు సుదర్శన్, షాహిద్, మహ్మద్‌షేక్, శనిగారపు రాజేష్, ఎం.డి.ముక్రం, అక్రం తదితరులున్నారు.

రైతుల సహకారంతోనే సంఘాభివృద్ధి

సారంగాపూర్: రైతుల సహకారంతోనే సంఘం అభివృద్ధి చెందుతుందని, ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సహకార సంఘ అధ్యక్షులు ఏలేటి నర్సింహరెడ్డి పేర్కొన్నారు. శనివారం సారంగాపూర్ సహకార సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘ సీఈవో లైసెట్టి శివకుమార్, ఉపాధ్యక్షుడు బాపిరాజు, శనిగరపు భూమేష్, వరుణ్‌కుమార్, శ్రీధర్, శ్రీనివాస్, సంఘ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

దేహ దానానికి విశ్రాంత ఉద్యోగి అంగీకారం

జగిత్యాల పట్టణం, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన పొన్నం నారాయణగౌడ్ అనే విశ్రాంత ఉపాధ్యాయుడు తన మరణానంతరం దేహాన్ని వైద్య కళాశాలకు దానమిచ్చేందుకు సంబంధించి అంగీకారం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ నారాయణగౌడ్‌ను శనివారం వారి స్వగృహంలో కలిసి అభినందించారు. ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి, టీవీ సత్యం, చెట్‌పల్లి సుధాకర్, శ్రీనివాస్, భానుతేజరావు పాల్గొన్నారు.



విశ్రాంత ఉద్యోగి పొన్నం నారాయణగౌడ్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

లోక్‌అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చని మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్ ఎన్.అరుణ్‌కుమార్ అన్నారు. మెట్‌పల్లి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులను పరిష్కరించారు. క్రిమినల్ కేసులు 61, ఎంసీడీవీసీ 7, చెక్‌బౌన్స్ 4, బ్యాంకులకు సంబంధించినవి 42, సివిల్ 8, డ్రంక్ అండ్ డ్రైవ్ 316 కేసులు పరిష్కారమైనట్లు న్యాయమూర్తి తెలిపారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ఉపాధ్యక్షుడు ఎల్ముల రాంబాబు, లోక్ అదాలత్ సభ్యులు వెంకటస్వామి, శంకర్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రణయ్, న్యాయవాదులు పాల్గొన్నారు.



మెట్‌పల్లి లోక్ అదాలత్‌లో న్యాయమూర్తి అరుణ్‌కుమార్, న్యాయవాదులు

భగత్‌సింగ్ కాంస్య విగ్రహావిష్కరణ

జగిత్యాల పట్టణం: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 117వ జయంతిని పురస్కరించుకొని స్థానిక వీక్లీబజార్‌లో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ దావ వసంత శనివారం ప్రారంభించారు. పురపాలక ఉపాధ్యక్షుడు గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నదాన టికెట్ల కోసం భక్తుల ఆరాటం

మల్యాల, న్యూస్‌టుడే: కొండగట్టు అంజన్న భక్తులకు అన్నదానం టికెట్లు లభించక నిరాశతో వెళ్లిపోతున్నారు. శనివారం మధ్యాహ్నం సమయంలో అన్నదానం టికెట్ల కోసం అధిక సంఖ్యలో భక్తులు ఎగబడ్డారు. శని, మంగళ వారాల్లో అంజన్న ఆలయానికి దాదాపు 20 వేలకుపైగా భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని వెళ్తుంటారు. శని, మంగళవారాల్లో 200 మందికి మిగిలిన వారాల్లో 100మందికి మాత్రమే అన్నదానం చేస్తుండటంతో వందలాది భక్తులకు అన్నదానం టికెట్లు లభించక నిరాశ చెందుతున్నారు. శనివారం మధ్యాహ్నం 11.20గంటలకు ఆలయ సిబ్బంది అన్నదానం టికెట్లు పంచుతుండగా అధిక సంఖ్యలో భక్తులు ఎగబడటం ఇక్కడి పరిస్థితులకు అద్దం పడుతుంది.



అంజన్న ఆలయం ముందు అన్నదానం టికెట్ల కోసం ఎగబడుతున్న భక్తులు

క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి సానుకూలం

జగిత్యాల విద్యానగర్: క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని శాసనసభ్యుడు ఎం.సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని శ్రీవివేకానంద మినీస్టేడియంలో డీవైఎస్‌వో ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన క్రీడాపోటీలు శనివారం ముగిసాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. నవీన్, లక్ష్మణ్, పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, లక్ష్మీరామ్‌నాయక్, పీఈటీలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

చికిత్స పొందుతూ రైతు మృతి

పెగడపల్లి: మండలంలోని దేవికొండకు చెందిన తాడూరి భూమయ్య (60) అనే రైతు తన పంట పొలం వద్ద ఈనెల 11న విద్యుదాఘాతానికి గురై.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు. మృతుని కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

దంపతులపై పలువురి దాడి

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో అప్పు చెల్లించాలని అడిగినందుకు దంపతులపై పలువురు దాడి చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన మర్రి గంగన్న ఆరేళ్ల కిందట ఇదే గ్రామానికి చెందిన తాటి జగన్‌కు రూ.69వేలు అప్పుగా ఇచ్చాడు. అప్పుగా ఇచ్చిన డబ్బులు చెల్లించాలని గంగన్న పెద్దమనుషుల మధ్య పంచాయితీ పెట్టాడు. ఇది మనసులో పెట్టుకున్న జగన్, అతని భార్య నీరజ, దీటి రాజు డబ్బులు అడిగితే చంపుతామంటూ దూషిస్తూ గంగన్న, అతని భార్య రాజవ్వలపై దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వివరించారు.

రుణమాఫీ వర్తింప చేసేవరకు ఉద్యమం

కోరుట్ల: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వర్తింప చేసే వరకు ఉద్యమిద్దామని రైతు ఐక్య వేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం కథలాపూర్ మండలంలోని సిరికొండ, కథలాపూర్, భూషణరావుపేట, చింతకుంట, పోసానిపేట, తాండ్ర్యాల గ్రామాల్లో రైతులతో సమావేశాలు ఏర్పాటు చేశారు.

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతిఒక్క హామీని వెంటనే నెరవేర్చాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో రైతులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నల్ల రమేష్ రెడ్డి, ఏలేటి చిన్నారెడ్డి, నేమూరి సత్యనారాయణ, తీగల శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే శిక్షార్హులు

జగిత్యాల: తల్లిదండ్రులను విస్మరిస్తే చట్టప్రకారం శిక్షార్హులని జగిత్యాల ఆర్డీవో పి.మధుసూదన్ అన్నారు. శనివారం వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపారు. జగిత్యాల పట్టణం, రాయికల్, గొల్లపల్లి మండలాల నుంచి పలువురు ఫిర్యాదు చేయగా ఆర్డీవో కుమారులు, కోడళ్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏవో తఫజుల్ హుస్సేన్, హరిఅశోక్‌కుమార్, ఎఫ్ఆర్‌వో కొండయ్య, పద్మజ తదితరులున్నారు.

సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలని నిరసన

రాయికల్ పట్టణం: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ నిలివేయడంతోపాటు అందుకు జారీ చేసిన జీవో 25 అమలును రద్దు చేయాలని కోరుతూ పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు.

సారంగాపూర్: ప్రభుత్వ ఉత్తర్వులు 25ను వెంటనే రద్దు చేయాలంటూ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. సారంగాపూర్‌లో శనివారం భోజన విరామ సమయంలో పెండింగ్ డీఏలు విడుదల చేయాలని, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు.

వెల్గటూరు: ఉపాధ్యాయుల సర్దుబాటు జీవోను రద్దుచేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడి చొప్పున నియమించాలని చెగ్యాంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.

స్వచ్ఛతాహీ సేవలో భాగస్వాములవ్వాలి

మేడిపల్లి: స్వచ్ఛతాహీ సేవలో అందరూ భాగస్వాములు కావాలని పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మేడిపల్లి మండలం కల్వకోటలో శనివారం ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించారు.

రాజీమార్గం ద్వారా కేసుల పరిష్కారం

ధర్మపురి: రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకొని.. ప్రజలు ప్రశాంత జీవనానికి నాంది పలకాలని జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ అన్నారు. శనివారం ధర్మపురి సబ్ కోర్టులో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించగా.. పలు కేసులను పరిష్కరించారు. ధర్మపురిలో 93, వెల్గటూర్ 62, బుగ్గారంలో 31 క్రిమినల్ కేసులను.. డ్రంక్ డ్రైవ్‌కు సంబంధించి 1098 కేసులను పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజేష్, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పెగడపల్లి: మండలంలోని శాలపల్లిలో పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ శనివారం పర్యటించారు. జాతీయ అవార్డుకు గ్రామాన్ని ప్రతిపాదిస్తున్నందున.. రికార్డులు, పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. డీపీవో రఘువరన్, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎంపీవో మహేందర్ ఉన్నారు.

వెల్గటూరు జట్టు విజయకేతనం

వెల్గటూరు: పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14 కబడ్డీ పోటీల్లో వెల్గటూరు బాలుర జట్టు విజయం సాధించింది. జగిత్యాలలో జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో వెల్గటూరు, ధర్మపురి జట్లు తలపడ్డాయి. ఇందులో వెల్గటూరు జట్టు విజయం సాధించింది. క్రీడాకారులను ఎంఈవో ప్రభాకర్ భూమేష్ అభినందించారు.

విద్యార్థులను సన్నద్ధం చేయాలి

బుగ్గారం: జాతీయ సాధన సర్వే పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా సెక్టోరల్ అధికారి రాజేష్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం బుగ్గారం జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రాథమిక స్థాయి పాఠశాల సముదాయ సమావేశాల నిర్వాహణను పరిశీలించారు.

మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా మల్లేశ్వరి


మల్యాల: మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ముత్యంపేట గ్రామానికి చెందిన బత్తిని మల్లేశ్వరిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యక్షులుగా కేతిరెడ్డి జీవన్‌రెడ్డి గడ్డం, సభ్యులతో పాటు పాలకవర్గ పదవీకాలం రెండేళ్లపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.

పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

రాయికల్ పట్టణం: పట్టణంలోని విజడమ్ ఉన్నత పాఠశాలలో ముందస్తు దసరా, బతుకమ్మ వేడుకలను శనివారం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బతుకమ్మ ఆడి పాడారు. కరస్పాండెంట్ ముత్యంపు రాజరెడ్డి, డైరెక్టర్ నివేదిత తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో విద్యార్థులు



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న అధికారులు

జీవాలకు అన్ని రకాల వైద్యసేవలు

మెట్‌పల్లి, న్యూస్‌టుడే: జీవాలకు అన్ని రకాల మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎస్ఎల్ మనోహర్ పేర్కొన్నారు. ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచిత యాంటీ రేబీస్ టీకాల కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు.

వెల్గటూరు: ప్రపంచ రేబీస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వెల్గటూరు పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. వ్యాధి సోకకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా ఆంటీ రేబీస్ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణి శ్రీప్రియ తెలిపారు. ఎంపీడీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన స్వాగతోత్సవం

కోరుట్ల, న్యూస్‌టుడే: కోరుట్ల పట్టణంలో రామక్రిష్ణ డిగ్రీ, పీజీ కళాశాల స్వాగతోత్సవం శనివారం నిర్వహించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ఛైర్మన్, కరస్పాండెంట్ యాద రామకృష్ణ విద్యార్థులకు సూచనలు చేశారు. డైరెక్టర్ హరిప్రియ, ఆకుల రాజేశ్, ఎంఏ బారీ, రాజు, ప్రవీణ్‌కుమార్, అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్యం